జరిగిపోతూంటుందని. నేను ప్రత్యేకంగా కూర్చుని సాధన చేస్తే కానీ నాకు అది జరగదు. నాలోని లోపం ఏమిటి స్వామీ?"

"లోపం నీది కాదు నాయనా, వాళ్ళ అవగాహనా లోపం అది. ఈ రోజుల్లో ఇది చాలామంది సాధకుల్లో వుంది. అదే నిజమై, సాధన వాళ్ళ ప్రమేయం లేకుండా సాగిపోయే అవకాశం వుంటే, వాల్మీకి భార్యా పిల్లల్ని పోషించుకుంటూ ఆ వ్యాపకాల్లో వుండేవాడు కాని, పదివేల సంవత్సరాలు తన చుట్టూ పుట్టలు కట్టేలా దీర్ఘ ధ్యాన సాధనలో సమయాన్ని గడిపేవాడు కాడు. అంతే కాదు. అప్పుడు సన్యాసాశ్రమానికి విలువెక్కడుంటుంది?"

## 13. నిర్భయానికి దారి

సన్న్యాసం తీసుకున్న తన భర్తని చాలా కాలం తర్వాత భార్య గంగానదిలోని ఓ పడవలో చూసింది. వెంటనే తన మాజీ భర్తని అడిగిందామె.

"ఒద్దంటూన్నా సన్న్యాసం తీసుకుని మీరేం సాధించారు?"

చిన్నగా నవ్వి ఊరుకున్నాడతను. ఇంతలో ఆకాశం నిండా దట్టంగా నల్లటి మబ్బులు కమ్మి ఉప్పెన వచ్చే ముందు వీచే గాలులు వీచసాగాయి. పడవలోని వారంతా ప్రాణ భయంతో వణికిపోతున్నారు. కాని ఆ సన్న్యాసి మొహంలో భయం బదులు అదే చిరునవ్వు.

"ఏమిటా నవ్వు? మీకు భయంగా లేదా? " అడిగింది భార్య.

లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడతను.

"అదేమిటి? ప్రాణ భయం లేదా?" ఆశ్చర్యపోయిందామె.

"నిన్నీ పడవలోంచి నేను తోసేస్తానని ఎవరైనా చెప్తే, నువ్వు అందుకు భయపడతావా?" అడిగాడా సన్న్యాసి.

"ఊహూ. భయపడను. నామీద ద్వేషం లేనప్పుడు మీరా పని ఎందుకు చేస్తారు?"

"ఈ ఉప్పెనలు, తుఫానులు భగవంతుడు సృష్టించినవే అయినా, నామీద ద్వేషం లేనప్పుడు ఆయన నన్ను నీళ్ళల్లో ముంచుతాడన్న భయం నాకూ లేదు." చెప్పాడతను.

పడవ క్షేమంగా ఒడ్డుకి చేరాక సన్న్యాసి భార్య అతనికి పాదాభివందనం చేసి చెప్పింది.

"మీకు సన్న్యాసాశ్రమ స్వీకారానికి అనుమతి ఇచ్చినందుకు నాకిప్పుడు ఎంతో గర్వంగా వుంది. మీరు చాలా సాధించారు."

## 14. గురువు చేసే పని

ఒకతను గురువు దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"గురువు లేకుండా మనిషి మోక్షం పొందలేడని శాస్త్రం అంటోంది. ఇందులో ఎంత నిజం వుంది?"

వెంటనే గురువు ఓ అద్దం తెప్పించి అతనికిచ్చి చెప్పాడు.

"అందులో నీ ప్రతిబింబం కనబడుతోందా? అది మిథ్యా నేను. అద్దం బయట వున్న నువ్వు అసలు నేను. అద్దం ముందు నిలబడే మిథ్యా నేనుని వదిలించుకో చూస్తాను."

"నా వల్ల కాదది." చెప్పాడతను ప్రయత్నించి.

గురువు అద్దాన్ని పగలకొట్టి మళ్ళీ చెప్పాడు.

"ఇప్పుడు మిథ్యా నేను మాయమై అసలు నేను మిగిలావు. అద్దం పగలకొట్టాలని అసలు నేనుకి తెలియదు. ఆ పని చేసేవాడే గురువు."

## 15. కోప నివారణా యంత్రం

ఒకతను ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామీ. నాకు ఊరికూరికే కోపం వస్తూంటుంది. దాన్ని కంట్రోల్ చేసుకోవడం నా వల్ల కావడం లేదు. మీరే నాకేదైనా మంచి సలహా ఇవ్వాలి."